


నేడు సీఎం చంద్రబాబు రాక?



సీఎం చంద్రబాబు బుధవారం ఉమ్మడి జిల్లాకు వచ్చే అవకాశం ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే బుధవారం మధ్యాహ్నానికి ఆయన రాజమహేంద్రవరం చేరుకుంటారని సమాచారం. తుఫాన్ తీవ్రత అధికంగా ఉండడం, తీరం దాటిన సమయంలో భారీగా నష్టం చోటుచేసుకున్న నేపథ్యంలో స్వయంగా సహాయక చర్యలు పర్యవేక్షించనున్నారు. తుఫాన్ బాధిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

గంటగంటకు పవన్ సమీక్ష



పిఠాపురం : తుఫాన్ ప్రభావం కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పకడ్బందీగా సహాయక చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచించారు. నివేదికలు ఆధారంగా మంగళవారం ప్రతి గంటగంటకు తుఫాన్ పరిస్థితులపై కలెక్టర్ షాన్‌మోహన్, ప్రత్యేక అధికారి కృష్ణతేజ, జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌లతో సమీక్షించారు. పిఠాపురం నియోజకవర్గంలో 25 పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి తాగునీరు, ఆహారం, ఔషధాలు, పాలు అందుబాటులో ఉంచడంతో పాటు జనరేటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కేంద్రాల్లో 12 వేల మందికి మధ్యాహ్న భోజనం, 15 వేల మందికి రాత్రి భోజనం ఏర్పాటు చేశామని, 5 వేల పాలప్యాకెట్లు, 1.50 లక్షల వాటర్ ప్యాకెట్లుతో పాటు వాటర్ ట్యాంకర్లు అందుబాటులో ఉంచామన్నారు. ఉప్పాడ, కోనపాపపేట, మూలపేట తదితర గ్రామాల్లో సహాయక కార్యక్రమాల పర్యవేక్షణకు గ్రామానికో ప్రత్యేకాధికారిని నియమించామన్నారు.

ధైర్యంగా ఉండండి : మంత్రి దుర్గేష్



నిడదవోలు : మొంథా తుఫాన్ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజలకు అండగా ఉన్నామని.. ప్రజలంతా ధైర్యంగా ఉండాలని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలులోని తమ క్యాంపు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని.. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు.. ప్రజలకు మధ్య అనుసంధానం చేస్తామన్నారు. తుఫాన్ బాధిత ప్రజలు 98481 66644, 95503 65446, 88865 19418, 94404 07096 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : పురందేశ్వరి



రాజమహేంద్రవరం అర్బన్ : మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజల భద్రతకు ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు తీసుకుందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు అమెరికా వెళ్లిన పురందేశ్వరి రాష్ట్రంలోని తుఫాన్ పరిస్థితులపై ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడారు.ముందస్తు చర్యలపై ఆరా తీశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ప్రభుత్వ అధికారులకు సహకరించాలని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. తుఫాన్ బాధిత ప్రాంతాల్లో వలంటీర్లుగా సేవలందించడానికి బీజేపీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయని జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర తెలిపారు.

ముంపు లేకుండా చర్యలు : ఎంపీ

పిఠాపురం : ఏలేరు వరద ముంపు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్టు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ తెలిపారు. పిఠాపురం-గొల్లప్రోలు మధ్య పిడిందొడ్డి రెగ్యులేటర్ సమీపంలో కోతకు గురవుతున్న ఏలేరు కాలువ గట్లను మంగళవారం సాయంత్రం డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబులతో కలిసి పరిశీలించారు. గట్లు కోతకు గురి కాకుండా ఇసుక బస్తాలు వేసే పనులను పరిశీలించారు. ఏలేరు కాల్వ గట్లపై పడిపోయిన చెట్లను తక్షణం తొలగించాలని ఇరిగేషన్ ఎస్‌ఈకి ఫోనులో సూచించారు. అనంతరం గొల్లప్రోలు బల్లకట్టు వద్ద ఏలేరు వరదను పరిశీలించారు. గట్లకు గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



ఏలేరు కాలువగట్టు పరిశీలిస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్



మండపేట, అమలాపురంలో ఇలా

వనంపై రణం

భారీ వృక్షాలు వేళ్లతో సహా పైకిలేచాయి.. చెట్లు విరిగిపడ్డాయ్.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం కనిపించిన చిత్రమిది.. తుఫాన్ నేపథ్యంలో ఈదురు గాలులకు వేల సంఖ్యలో చెట్లు నేలవాలాయి.



బిక్కవోలులో ఈదురుగాలులకు ఊగుతున్న కొబ్బరిచెట్లు

చినుకు వణుకు

వరుణుడు తుఫాన్ జాడ చెబుతూనే ఉన్నాడు.. మంగళవారం ఉదయం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడా తెరిపివ్వలేదు. వర్షం పడుతూనే ఉంది.. దీంతో అంతటా అప్రమత్తమయ్యారు.



అనపర్తి, అల్లవరంలలో కూలిన విద్యుత్ స్తంభాలు

కరెంట్ ఇష్యూ

తుఫాన్ దెబ్బకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయితే ఎన్నడూలేనంత వేగంగా వాటిని పునరుద్ధరించడం విశేషం.



అక్కడే తీరం దాటేది : కాకినాడ నుంచి తుఫాన్ తీవ్రతను పరిశీలిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



అల్లకల్లోలం : తుఫాన్ తీవ్రత కారణంగా ఉప్పాడ వద్ద బీచ్‌రోడ్డుపైకి ఎగడిపడుతున్న అలలు..ఈ రోడ్డులోనే అలల ధాటికి రాళ్లు ఎగిరిపడుతున్నాయి.. ఇప్పటి వరకూ రెండు చోట్ల గండి కూడా పడింది.. బుధవారం తీవ్రత ఎలా ఉంటుందోనని పరీవాహక ప్రాంత ప్రజానీకం భయాందోళన చెందుతున్నారు.



చొచ్చుకొచ్చింది : ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం రిస్ట్ ప్లాంట్ భవన సముదాయాన్ని చుట్టుముట్టిన సముద్రపు నీరు



అన్నదాతకు వర్రీయే : తుఫాన్ తీవ్రతకు అంబాజీపేట మండలం గంగలకుర్రులో నేలకొరిగిన వరిచేను.. ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల ఇదే పరిస్థితి..

ఉగ్ర మొంథా!

భీకరం.. భయంకరం

(కాకినాడ/అమలాపురం - ఆంధ్రజ్యోతి)

ఏం జరుగుతుందో.. ఏమైపోతుందో..
ఎక్కడ తీరం దాటుతుందో..
గత మూడు రోజులుగా ఒక్కటే టెన్షన్..
ఎందుకంటే మొత్తమొంథా కమ్మేసింది..
పచ్చని గోదావరి జిల్లాల్లో అల్లకల్లోలం..
తుఫాన్ తీవ్రతకు అతలాకుతలమయ్యాయి..
ఎటు చూసినా కూలిన చెట్లు.. భారీ వృక్షాలు
విరిగిపడిన విద్యుత్ స్తంభాలు.. కొబ్బరి చెట్లు..
వెన్నువిరిగిన వరి చేలు..
అంతా బాగుందనుకునేలోపే ఉపద్రవం..
ఎటు చూసినా కష్టం.. నష్టమే మిగిల్చింది..
ప్రభుత్వం అప్రమత్తమైంది..
ఒక పక్కన చంద్రబాబు.. మరో పక్కన పవన్..
సమీక్షలు చేస్తూనే ఉన్నారు..
పోలీసులు అప్రమత్తమయ్యారు..
పలు రైళ్లు, బస్ సర్వీసులు రద్దు చేశారు.
బడులకు సెలవులిచ్చేశారు..
తుఫాన్ సహాయక చర్యల నిమిత్తం
సీఎం చంద్రబాబు రానుండడంతో
అధికారులు ఉరుకులు
పరుగులు పెడుతున్నారు..

- అంతర్వేది వద్ద తీరం దాటిన తుఫాన్
- వణికించిన తుఫాన్.. ఉమ్మడి జిల్లా విలవిల
- ఈదురుగాలులు, కుంభవృష్టి వానలు
- ఉప్పాడ వద్ద బీచ్ రోడ్డుకు గండ్లు
- నేడు బడులకు సెలవు

కుంభవృష్టిగా వాన.. కూకటివేళ్లతో లేచిపోయిన వేలాది కొబ్బరిచెట్లు.. తాటిచెట్లు.. సముద్రం కూడా ప్రళయంగా మారింది.. మొంథా తుఫాన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను చిగురుటాకులా వణికించింది. 1996 నవంబరు 6 తుఫాన్‌ను గుర్తుచేస్తూ ప్రజలు విలవిలలాడేలా చేసింది. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు తుఫాన్ తీవ్రతకు విలవిల్లాడాయి. ఉదయం నుంచీ ఈ రెండు జిల్లాలతో పాటు తూర్పుగోదావరి జిల్లాలోనూ భారీ వర్షం కురిసింది. అదే సమయంలో తీవ్రమైన పెను గాలులు భయాందోళనలకు గురిచేశాయి.గాలుల తీవ్రతకు మహా వృక్షాలు నేలకొరిగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది చెట్లు కూకటివేళ్లతో సహా నేలవాలాయి. అటు తుఫాన్ తీరం దాటే సమయంలో మంగళవారం అర్ధరాత్రి కాకినాడ, కోనసీమ జిల్లాల్లో కుంభవృష్టిని మించిన వాన కురిసింది. అటు తీర ప్రాంతంలో ఈదురుగాలులు భీకరంగా మారి హోరున శబ్దాలతో జనాన్ని వణికించాయి. అర్ధరాత్రి పన్నెండు దాటే సమయానికి కోనసీమ జిల్లాలో వేలాది కొబ్బరి, ఇతర చెట్లు నేలకూలాయి.అమలాపురం- రావులపాలెం జాతీయ రహదారి పైనా భారీ వృక్షాలు నేలకూలాయి. అంతర్వేదిపాలెంలో తుఫాన్ తీరం దాటడంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. అంతర్వేదిలో సముద్రపు కెరటాలు లైట్‌హౌస్‌కు తాకాయి. రాజోలు నియోజకవర్గంలో పలు సెల్‌టవర్లు దెబ్బతిన్నాయి. తుఫాన్ హెచ్చరికలతో కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు హుటాహుటిన అమలాపురం చేరుకుని అధికారులతో సమీక్షించారు. ఇక మంగళవారం సాయంత్రం నుంచి జిల్లావ్యాప్తంగా అన్ని రహదారులపై రాకపోకలు నిలిపివేశారు. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా నుంచి కూడా అన్ని బస్సులను కోనసీమకు వెళ్లకుండా నిలిపివేశారు. దాదాపు అన్ని చోట్ల దుకాణాలు మూసివేయడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. తుఫాన్ తీవ్రతకు కాకినాడ ఉప్పాడ బీచ్ ప్రళయంగా మారింది. పదిహేను మీటర్లకు పైగా ఎత్తున అలలు ఎగసిపడడంతో బీచ్ రోడ్డుకు రెండుచోట్ల గండిపడింది. మరోపక్క తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస శిబిరాలకు తీరప్రాంత ప్రజలను అధికారులు బస్సుల్లో తరలించారు.మంగళవారం ఉదయం నుంచీ చెట్లు కూలిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను ఎక్కడిక్కడ అధికారులు నిలిపివేశారు. కూలిన విద్యుత్ స్తంభాలను మార్చడం, ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లను కొత్తవి ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరాను గంటల వ్యవధిలోనే పునరుద్ధరించారు.కొన్ని గ్రామాల్లో మాత్రం అంధకారం నెలకొంది. తుఫాన్ మంగళవారం అర్ధరాత్రి తీరం దాటగా..దీని ప్రభావంతో మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది.

భారీ వాహనాలు నిలిపివేత

తుఫాన్ నేపథ్యంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై రాత్రి ఏడు గంటల నుంచి భారీ వాహనాలు నిలిపివేశారు. జగ్గంపేటలో చెన్నై టు కోల్‌కతా జాతీయ రహదారి మూసివేశారు. దాంతో భారీ వాహనాలన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి.



కత్తిపూడి వద్ద హైవేపై నిలిచిన లారీలు

తాటిచెట్టు విరిగిపడి మహిళ దుర్మరణం



మామిడికుదురు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పలకరించడానికి వచ్చిన ఒక మహిళ తాడిచెట్టు విరిగి పడి మృతిచెందింది. కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం మాకనపాలెం గ్రామానికి చెందిన గూడపల్లి వీరవేణు (49) అదే గ్రామంలో ఉండే తన ఆడబడుచు కుమారుడు అనారోగ్యం పాలవడంతో అతడిని పలకరించడానికి వచ్చింది. తిరిగి వెళ్లే సమయంలో ఈదురుగాలుల ప్రభావంతో తాడిచెట్టు విరిగి మీద పడి అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో మాకనపాలెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలాన్ని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సందర్శించి ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పునరావాస కేంద్రాలకు 12,135మంది బాధితులు

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో తీర, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న 12,135 మంది బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ తుఫాన్‌వల్ల 18మండలాల్లో 67 గ్రామాలు, ఐదు పట్టణ ప్రాంతాలు ప్రభావితం అయ్యాయన్నారు. ఈ ప్రాంతాల్లో ప్రజలు ప్రాణ,ఆస్తినష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ఒక కంట్రోల్‌రూమ్, ఆర్డీవో కార్యాలయాల్లో రెండు, 21 మండలాల్లో 21 కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో మొత్తంగా 401 పునరావాసకేంద్రాలను గుర్తించి ఇప్పటివరకు 76కేంద్రాలు ప్రారంభించామన్నారు. జిల్లాలో 21,513 ఆహార పొట్లాలు బాధితులకు పంపిణీ చేశారు.

తీరప్రాంతంలో ఉన్న 4573 బోట్లను సముద్రంనుంచి వెనక్కి రప్పించారు. ఉప్పుటేరు, కెనాల్‌లలో లంగర్ వేసి ఉంచారు. సహాయకచర్యల్లో భాగంగా 85 వీహెచ్‌ఎఫ్ సెట్లు, తాళ్లరేవు, యు.కొత్తపల్లిలో 2 శాటిలైట్ ఫోన్లు ఏర్పాటు చేశారు. 54 మందితో రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, 50 మందితో మరో ఎన్డీఆర్ఎఫ్ బృందం సహాయక చర్యల్లో ఉన్నారు. జిల్లాలో 259 మెడికల్ క్యాంపులు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. లోతట్టు ప్రాంతాలనుంచి 9901పశువులను తరలించారు. 3వేల విద్యుత్ స్తంభాలు, 44 క్రేన్లు, 1.34 లక్షల కిలోల బ్లీచింగ్, వంటలకు 49,269 మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ బియ్యం అందుబాటులో ఉంచారు.

ఉగ్రరూపం దాల్చిన సముద్రం

- రెండు తాటిచెట్ల ఎత్తులో అలలు
- రెండుచోట్ల గండ్లు పడిన బీచ్‌రోడ్డు

కొత్తపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథాతుఫాన్ కారణంగా కొత్తపల్లి మండలం ఉప్పాడతీరంలో సముద్రం ఉగ్రరూపం ప్రదర్శించింది. దీంతో ఉప్పాడ-కాకినాడ బీచ్‌రోడ్డులో సుబ్బంపేట-కొత్తపట్నం వద్ద రోడ్డు రెండుచోట్ల గండ్లు ఏర్పడ్డాయి. మంగళవారం ఉప్పాడ తీరంలో సముద్రం ఉప్పొంగి 20అడుగులు ముందుకు దూసుకొచ్చింది.రెండు తాటిచెట్ల ఎత్తులో రాకాసి అలలు దూసుకొచ్చాయి.దీంతో కొత్తపట్నం వద్ద గతంలో ఏర్పాటు చేసిన జియోట్యూబ్‌కు కూతవేటుదూరంలో బండరాళ్లు డంప్ చేసిన రెండుచోట్ల గండ్లు పడ్డాయి. కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ కొత్తపట్నం, బర్మాకాలనీల్లోకి దూసుకువెళ్లాయి. మత్స్యకారులు భయాందోళనలతో పునరావాసకేంద్రాలకు తరలివెళ్లారు. కొత్తపట్నం వద్ద బీచ్‌రోడ్డుకు పడిన గండిని తక్షణం పూడ్చాలని వారు కోరుతున్నారు. ఉప్పాడ-అమీనాబాద్ మినీహార్బర్లో నిర్మాణంలో భవనాల పునాదులు మునిగిపోయాయి.

ఈదురుగాలులకు అతలాకుతలం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ జిల్లాపై తీవ్ర ప్రభావం చూపింది. మంగళవారం తెల్లవారుజామునుంచి పరిస్థితి భయానకంగా మారింది. భారీఈదురుగాలులు జిల్లాను అతలాకుతలం చేశాయి. విద్యుత్‌వైర్లు తెగి పడ్డాయి. హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. జిల్లావ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కాకినాడలో ఏటిమొగ, సంజయ్‌నగర్, దుమ్ములపేట, పర్లోపేట తదితరప్రాంతాల్లో తుఫాన్ పరిస్థితిపై కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, ఎంపీలు ఉదయ్, సతీష్, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పర్యటించారు. పునరావాసకేంద్రాల్లో ఉంటున్న వారికి భోజనాలు, వసతి సౌకర్యాలను పరిశీలించారు. కాకినాడనుంచి కోనపాపపేట వరకు తీరప్రాంతాలను ఎమ్మెల్సీ పద్మశ్రీ పరిశీలించారు. ఈదురుగాలులకు చెట్లు నేలకొరిగి పలుచోట్ల ఇంటిపైన, కలెక్టరేట్ ఎదురుగా ఉన్న వీధిలోను విద్యుత్ తీగలపై పడ్డాయి.

తొలిరోజు 25వేల కార్డులకు రేషన్ పంపిణీ

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో తొలిరోజు మంగళవారం జిల్లాలో 25వేల రేషన్‌కార్డులకు బియ్యం, పంచదార పంపిణీ చేశారు. తుఫాన్‌వల్ల ప్రజలు ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో నవంబరు నెలకు సంబంధించిన రేషన్‌సరుకులు ముందుగానే పంపిణీ ప్రారంభించినట్లు జిల్లాపౌరసరఫరాలశాఖాధికారి సత్యనారాయణరాజు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిలిచిన సేకరణ ప్రక్రియ

జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ నిలిచిపోయింది. 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా కాగా ఇప్పటివరకు 3.2 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు.

సహాయ చర్యలకు కంట్రోల్ రూమ్

తుఫాన్ సహాయ చర్యలకు కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్: 0884- 2356801 నెంబరును సంప్రదించాలి. కాకినాడ ఆర్డీవో కార్యాలయం: 8008803208, 9701579666, పెద్దాపురం ఆర్డీవో కార్యాలయం: 9949393805 సంప్రదించాలి.

ఆర్టీసీ సర్వీసులు నిలిపివేత

కార్పొరేషన్(కాకినాడ),అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): కాకినాడ డిపో నుంచి తిరిగే 171 బస్సు సర్వీసుల్లో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు 96 సర్వీసులను తిప్పామని ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని అన్నిరూట్లలో ఆర్డినరీ సర్వీసులతోపాటు దూరప్రాంతాలకు వెళ్లేవాటిని కూడా మధ్యాహ్నం 3గంటల నుంచి పూర్తిగా రద్దు చేశామని ఆయన చెప్పారు. హైదరాబాద్ రూట్‌లో నాలుగు బస్సులు రద్దు చేశామని, మరో మూడు బస్సులు మాత్రం యథావిధిగా తిరుగుతాయని అన్నారు. దూరప్రాంత సర్వీసులు అనంతపురం, కడప, శ్రీశైలం, కర్నూలు, తిరుపతి, చెన్నై, పాతపట్నం తదితర ప్రాంతాల సర్వీసులను పూర్తిగా రద్దు చేశామన్నారు. బడి బస్సులు అన్ని మాత్రం ఉదయంనుంచి రద్దు చేశామన్నారు.

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు గడువు పొడిగింపు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తులకు మరో మూడు నెలల గడువు(జనవరి 23 వరకు) పొడిగిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ జీవో ఆర్టీ నెంబరు 1173 జారీ చేసింది. రాష్ట్రంలో అనధికార లేఅవుట్లు, ప్లాట్లను రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

గోదావరి, గౌతమి సహా మరిన్ని రైళ్లు తాత్కాలిక రద్దు

ఫలక్‌నుమా దారి మళ్లింపు

రాజమహేంద్రవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో మరిన్ని రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశారు. రాజమహేంద్రవరం, సామర్లకోట మీదుగా వెళ్లాల్సిన సుమారు 20 రైళ్లను తాత్కాలికంగా నిలిపివేశారు. పలు రైళ్ల సమయాలను సవరించారు. సికింద్రాబాద్ వైపు వెళ్లే రైళ్లను దాదాపు రద్దు చేశారు. 28న 17210 కాకినాడ-బెంగళూరు, 07060 అనకాపల్లి-సికింద్రాబాద్, 17247 నర్సాపురం-ధర్మవరం, 17255 నర్సాపురం-లింగంపల్లి, 12737 కాకినాడ-లింగంపల్లి, 12755 కాకినాడ-లింగంపల్లి, 17215 మచిలీపట్నం-హిందూపురం, 17215 మచిలీపట్నం-హిందూపురం, 12727 విశాఖ-హైదరాబాద్, 22203 విశాఖ-నాందేడ్, 12738 లింగంపల్లి-కాకినాడ, 29న 17248 ధర్మవరం-నర్సాపురం, 17256 లింగంపల్లి-నర్సాపురం, 12776 లింగంపల్లి-కాకినాడ, 17216 హిందూపురం-మచిలీపట్నం, 30న 17479 పూరి-తిరుపతి తాత్కాలికంగా రద్దయ్యాయి. 12703 హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా, 18638 బెంగళూరు-హతియా, 18189 టాటానగర్-ఎర్నాకులం రైళ్లను దారి మళ్లించారు. 12842 చెన్నై-హౌరా, 22870 చెన్నై-విశాఖ, 22604 విల్లుపురం- ఖరగ్‌పూర్, 12840 చెన్నై-హౌరా, 12664 తిరుచిరాపల్లి-హౌరా, 22501 బెంగళూరు-న్యూ తిన్సుకియా, 12836 బెంగళూరు-హతియా, 12503 బెంగళూరు-అగర్తలా, 12246 బెంగళూరు-హౌరా, 12864 బెంగళూరు-హౌరా, 18045 షాలిమార్-చర్లపల్లి, 22825 షాలిమార్-చెన్నై, 22887 హౌరా-బెంగళూరు, 12841 హౌరా-చెన్నై, 22807 సంత్రాగచి-చెన్నై, 22853 షాలిమార్-విశాఖ, 17481 బిలాస్‌పూర్-తిరుపతి, 13351 ధన్‌బాద్-అలెప్పీ, 03252 బెంగళూరు-ధన్‌బాద్ రైళ్ల ప్రారంభ స్టేషన్ల నుంచి బయల్దేరే సమయాలను 28న 7 నుంచి 12 గంటలు పొడిగించారు. ఈ రైళ్లు ఆలస్యంగా నడవనున్నాయి. రాజమహేంద్రవరంలోని ఆర్చి బ్రిడ్జిపై మరమ్మతులు జరుగుతున్నాయి. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైళ్లను నిలుపుదల చేయనున్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మీదుగా రాకపోకలు సాగించే మరో 22 ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే పీఆర్వో కార్యాలయ అధికారులు తెలిపారు. 12806 లింగంపల్లి-విశాఖ, 18046 చర్లపల్లి-షాలీమార్, 17016 సికింద్రాబాద్-భువనేశ్వర్, 12704 సికింద్రాబాద్-హౌరా, 17480 తిరుపతి- పూరి, 18522 కడప-విశాఖ, 18463 భువనేశ్వర్- బెంగళూరు, 17015 భువనేశ్వర్-సికింద్రాబాద్, 20851 భువనేశ్వర్-పుదుచ్చేరి, 22875, 22876 విశాఖ- గుంటూరు-విశాఖ, 12727 విశాఖ-సికిం ద్రాబాద్, 12739 విశాఖ-సికింద్రాబాద్, 20835 విశాఖ-న్యూఢిల్లీ, 17220 విశాఖ-మచిలీపట్నం, 18519 విశాఖ-ముంబయి, 17244 రాయగడ- గుంటూరు, 11020 భువనేశ్వర్-ముంబయి ఎక్స్ ప్రెస్ మంగళవారం రద్దయ్యాయి. 12738 లింగంపల్లి-కాకినాడ ఎక్స్‌ప్రెస్‌ను బుధవారం రద్దు చేశారు. సామర్లకోట రైల్వే స్టేషన్లో ప్రయాణికులకు మరింత సమాచారం అందించేందుకు ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్‌ను కొనసాగిస్తున్నట్టు సూపరింటెండెంట్ రమేష్ తెలిపారు.

తీర గ్రామాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలి

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

కాకినాడ క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయ కంట్రోల్ రూమ్ నుంచి మంగళవారం ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ లైవ్ మ్యాప్ ద్వారా పరిశీలించారు. గ్రేహౌండ్స్ డీఐజీ అట్టాడ బాపూజీ, ఎస్పీ జి.బిందుమాధవ్‌లతో కలిసి జిల్లాలోని పరిస్థితులను సమీక్షించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, గాలి వేగం వంటి వివరాలను విండి లైవ్ మ్యాప్ ద్వారా పరిశీలించారు. తుఫాన్ సమయంలో ప్రజల భద్రత, వాహన రాకపోకల నియంత్రణ, రక్షణ చర్యలు, అత్యవసర సేవలు సమర్థవంతంగా కొనసాగేందుకు తగిన సూచనలు చేశారు. పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో ప్రతిస్పందన బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే తీర ప్రాంతాల్లో నిరంతరం ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నప్పుడు ప్రజలకు సకాలంలో సమాచారం అందించేందుకు కమాండ్ కంట్రోల్ సెంటరును 24 గంటలూ యాక్టివ్‌గా ఉంచాలని ఆదేశించారు. ప్రజలు అత్యవసరమైతేనే తప్ప బయటకు రాకుండా అధికారులు చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి తుఫాన్ సాధారణ స్థాయికి వచ్చేంత వరకు ప్రజల భద్రతను కాపాడేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఐజీ కోరారు.

తాండవ జలాశయం నుంచి

నీటి విడుదల

- పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తం


తుని వద్ద ఉధృతంగా తాండవ ప్రవాహం

తుని రూరల్/కోటనందూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తాండవ జలాశయం నుంచి నీటిని దిగువకు విడిచిపెట్టిన నేపథ్యంలో తుని వద్ద తాండవ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అధికార యంత్రాంగం 1వ వార్డుతో పాటుగా నదీ ప్రవాహాన్ని అనుకుని నివాసముంటున్న ప్రజానీకాన్ని అప్రమత్తం చేశారు. తాండవ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 377.70 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 1200 క్యూసెక్కులుగా ఉంది. మొంథా తుఫాన్ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా స్పిల్‌వే ద్వారా 2472 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేశారు.


గొల్లప్రోలులో మంగళవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో విద్యుత్ స్తంభాలను సరిచేసి మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

విద్యుత్ స్తంభాలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

గొల్లప్రోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఉత్పన్నమైన పరిస్థితులకు ఏపీఈపీడీసీఎల్ అధికారులు యుద్ధప్రాతిపదికన స్పందించారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు వీచిన ఈదురు గాలులకు కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణం, మండలంతో పాటు పిఠాపురం పట్టణం, మండల పరిధిలోని గ్రామాల్లో 115కి పైగా ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. అంతకంటే అధిక సంఖ్యలో కరెంటు తీగలు తెగిపోయాయి. ఉదయం నుంచి వర్షం పడుతున్నా, గాలులు వీస్తున్నా లెక్క చేయకుండా క్రేన్లు, ఎక్స్‌కవేటర్ల సహాయంతో స్తంభాలను సరిచేయడం, మార్పు చేయడంతో పాటు కొత్తగా విద్యుత్ తీగలు ఏర్పాటుచేసి మరమ్మతులు నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది, అధికారులు అర్ధరాత్రి వరకు ఇదే పనిలో నిమగ్నమయ్యారు.

కోతకు గురవుతున్న జాతీయ రహదారి

ఏలేరు నీటి ఉధృతితో కలవరం

గొల్లప్రోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏలేరు ప్రవాహ ఉధృతికి 216 జాతీయ రహదారి కోతకు గురవుతోంది. ఏలేరు నుంచి వస్తున్న వరద జలాలు గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలో పిఠాపురం-గొల్లప్రోలు వైపు వెళ్లే రోడ్డును కోస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. రిజర్వాయరు నుంచి నీటి విడుదల ఏమాత్రం అధికమైనా రహదారి మరింతగా కోతకు గురయ్యే అవకాశం ఉంది. రోడ్డు తెగిపోతే పంట పొలాలు ముంపునకు గురవుతాయని రైతులు చెప్తున్నారు. ఈ విషయాన్ని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లడంతో ఆయన నేషనల్ హైవే అథారిటీ పీడీతో ఫోనులో మాట్లాడారు. తక్షణం కోతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.


గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలో కోతకు గురవుతున్న 216వ జాతీయ రహదారి



బోసిపోయిన కడియం పూల మార్కెట్

కడియం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో వ్యాపారులు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో పూల రైతులు, వ్యాపారులతో నిత్యం రద్దీగా ఉండే కడియపులంక అంతర్ రాష్ట్ర పూల మార్కెట్ బోసిపోయింది. వ్యాపార సంస్థలను మూసివేశారు. ఉదయం నుంచి వర్షం పడుతుండడంతో జనజీవనం స్తంభించింది. నిత్యం సందర్శకులతో కళకళలాడే నర్సరీలు ఖాళీగా కనిపించాయి.

వ్యాపారులు, రైతులు లేక ఖాళీగా ఉన్న అంతర్ రాష్ట్ర పూల మార్కెట్

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కొత్త తేదీన ఆర్యన్



విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించిన 'ఆర్యన్' చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 31న ఈ చిత్రం విడుదలవ్వడం లేదు. ఒక వారం ఆలస్యంగా నవంబర్ 7న 'ఆర్యన్' చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు విష్ణు విశాల్ తెలిపారు. 'రవితేజ నటించిన 'మాస్ జాతర', 'బాహుబలి: ది ఎపిక్' చిత్రాలు కూడా ఈ నెల 31న విడుదలవుతున్నాయి. రవితేజతో నాకున్న స్నేహం, రాజమౌళిపై గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన తెలిపారు. అయితే 'ఆర్యన్' తమిళ వెర్షన్ మాత్రం ఈ నెల 31నే విడుదలవనుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆర్యన్' చిత్రానికి ప్రవీణ్ కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్ నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సెల్వ రాఘవన్ కీలకపాత్ర పోషించారు. శ్రేష్ట మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.



ఉగాదిన విడుదల

అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో తెరకెక్కిస్తోన్న రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. మొదట డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా మేకర్స్ కొత్త తేదీని ప్రకటించారు. 2026 ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ని అడివి శేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకి వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరమే లేదు' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, అడివి శేష్ సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

శ్రీకాంత్ తివారి వచ్చేస్తున్నాడు



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఓ సరికొత్త ఒరవడిని సృష్టించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటి వరకూ రెండు సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో భాగం సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి స్ట్రీమింగ్ వివరాల కోసం అభిమానులు ఎంతగానో ఆసక్తిగా ఎదురుచూడసాగారు. తాజాగా మేకర్స్ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. ఆమెజాన్ ప్రైమ్‌లో నవంబరు 21 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైవలెన్స్ సెల్(టాస్క్) సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ తివారి పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ మరోసారి అలరించనున్నారు. రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ నటనకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మూడో భాగంలో ఆయన నటనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సిరీస్ అందుబాటులో ఉంటుంది.

నటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలి



దేశవ్యాప్తంగా సినీ రంగంలో చర్చనీయాంశమైన పనివేళల అంశంపై కథానాయిక రష్మిక మందన్న స్పందించారు. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక తాను కూడా అధిక పని ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అంగీకరించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ... రోజుకు పది పన్నెండు గంటలకు మించి పనిచేయడం ఎంత కష్టమో, కుటుంబ, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం ఎంత అవసరమో ఆమె వివరించారు. 'నేను కూడా ఎక్కువగంటలు పనిచేస్తున్నాను. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయవద్దని అందరికీ చెబుతున్నాను. ఆఫీసులో ఉద్యోగులకు ఉన్నట్లే నటీనటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ ఉండాలి' అని రష్మిక అభిప్రాయపడ్డారు. ఒక షెడ్యూల్ పెట్టుకొని రోజుకు 8 గంటలు కంటినిండా నిద్రపోవాలి, వృత్తిని వ్యక్తిగత జీవితాన్ని బేలన్స్ చేసుకోవాలని ఆమె సూచించారు. నిర్ణీత పనివేళల డిమాండ్‌తో దీపికా పదుకొనే కొన్ని సినిమాల నుంచి వైదొలగిన్పటి నుంచి పలువురు నటీనటులు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.



చట్టమా? విశ్వాసమా?

యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హక్'. ముస్లిం మహిళల హక్కుల పోరాటంలో మైలురాయిగా నిలిచిన 'మొహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షా బానో బేగం' కేసు ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు సువర్ణ్ వర్మ ఎస్ తెరకెక్కించారు. నవంబర్ 7న ఈచిత్రం విడుదలవుతోంది. హర్మాన్ బవేజా, విశాల్ గుర్నాని నిర్మించారు. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. చట్టం, విశ్వాసం, న్యాయం మధ్య సంఘర్షణ ప్రధానాంశంగా దర్శకుడు కథను మలచిన తీరు ఆకట్టుకుంటోంది. షాబోనో బేగం పాత్రలో యామీ గౌతమ్, ఆమె భర్తగా ఇమ్రాన్ హష్మీ తమదైన శైలిలో నటించి మెప్పించారు.

నా కోసం ఆ వెన్నెల



ప్రేమలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ చెలియా'. నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందిరా దేవి ప్రొడక్షన్స్ పతాకంపై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నా కోసం ఆ వెన్నెల' అంటూ సాగే ప్రేమగీతాన్ని నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. హీరో హీరోయిన్ల అనుబంధాన్ని వివరిస్తూ సాగే ఈ గీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ ఆలపించారు.

రెహమాన్ సంగీత విభావరి



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన సంగీత విభావరితో మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'హైదరాబాద్ టాకీస్' ఆధ్వర్యంలో నవంబరు 8న రామోజీ ఫిలిం సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ ' తెలుగు సినిమాలు చేస్తూనే పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా.' అని అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్‌ని డాల్బీ అట్మోస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు.

'మొంథా' బీభత్సం

మొంథా తుఫాన్ ఉమ్మడి జిల్లాలో మంగళవారం బీభత్సం సృష్టించింది. భారీ ఈదురుగాలుల ధాటికి భారీ వృక్షాలు, కొబ్బరి చెట్లు వంటివి కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తీవ్ర నష్టం వాటిల్లగా కాకినాడ జిల్లాలోను నష్టం నమోదైంది. ఎక్కడికక్కడ అధికార యంత్రాంగం అప్రమత్తమై వెంటనే సహాయక చర్యలు చేపట్టింది. కొన్నిచోట్ల ముందు జాగ్రత్తగా వృద్ధులను పునరావాస కేంద్రాలకు తరలించారు. అక్కడ వారికి భోజన ఏర్పాట్లు చేశారు.



అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు ప్రధాన రహదారిలో విరిగిపడిన కొబ్బరిచెట్టు


అంతర్వేదిపల్లిపాలెంలో వృద్ధుడిని పునరావాస కేంద్రానికి తరలిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది

కూలిన చెట్లు.. ఎప్పటికప్పుడు తొలగింపు

అమలాపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ గాలులకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా కూలిన చెట్లను అధికారుల ఆధ్వర్యంలో స్థానికుల సహాయంతో శరవేగంగా తొలగించారు. తుఫాన్ ప్రభావంతో వచ్చిన ఈదురుగాలుల ధాటికి కోనసీమలో భారీఎత్తున కొబ్బరి చెట్లు, రహదారుల వెంబడి భారీ చెట్లు చాలాచోట్ల కుప్పకూలిపోయాయి. వెంటనే తొలగించి రాకపోకలను పునరుద్ధరించడంలో వెంటనే చర్యలు చేపట్టారు. వీటికి భారీ క్రేన్లు, కటింగ్ మిషన్లు, కత్తులను వినియోగించారు. జొన్నాడ హైవేపై పడిన భారీ వృక్షాన్ని జాతీయ రహదారులశాఖ ఆధ్వర్యంలో తొలగింపు వేగవంతంగా జరిగింది. కోనసీమలో అనేకచోట్ల రహదారి మధ్యలో కూలిన వృక్షాలను పంచాయతీ సిబ్బంది వెంటనే తొలగించే ప్రక్రియను వేగవంతం చేశారు.


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జొన్నాడ సమీపంలో హైవేపై కూలిన వృక్షాలను తొలగిస్తున్న హైవే సిబ్బంది


అమలాపురం పట్టణం గాంధీనగర్‌లో కుప్పకూలిన విద్యుత్ స్తంభం


ఐ.పోలవరం మండలంలో వృద్ధుడిని పునరావాస కేంద్రానికి తరలిస్తున్న స్థానికులు


కొత్తపల్లి మండలం ఉప్పాడలోని పునరావాస కేంద్రంలో భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం


యానాం భీమ్‌నగర్‌లో ఇంటిపై కూలిన చెట్టును తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


రాయవరం మండలం పసలపూడి రోడ్డులో కూలిన చెట్టును తొలగిస్తున్న స్థానికులు


పి.గన్నవరం: రాజవరం-పొదలాడ రహదారిపై చాకలిపాలెం వద్ద విరిగిపడిన చెట్టు తొలగింపు


ముమ్మిడివరం మండలం క్రాపచింతలపూడిపాలెం-పల్లవారిపాలెం రోడ్డులో కూలిన వృక్షం


ఉప్పాడ, ఆత్రేయపురంల్లోని పునరావాస కేంద్రాల్లో భోజనాలు చేస్తున్న వృద్ధులు


ఐ.పోలవరం మండలం భైరవపాలెంలో పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు, ఎంపీ హరీష్


కాజులూరు మండలం గొల్లపాలెంలో రోడ్డుపై కూలిన చెట్లను పరిశీలిస్తున్న మంత్రి సుభాష్


అంబాజీపేట మండలం చిందాడగరువులో ఇంటిపై కుప్పకూలిన వృక్షం


ఐ.పోలవరం మండలంలోని పునరావాస కేంద్రంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం


ఏలేశ్వరం మండలం అప్పనపాలెం కాజ్‌వే పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ


మలికిపురంలో పునరావాస కేంద్రాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్


మలికిపురం మండలం గూడపల్లిలో రామాలయంపై పడిన చెట్టు

బైక్ సీటు కింద బుస్ బుస్...

తుని రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం రేఖవానిపాలెం సమీపంలో మంగళవారం మధ్యాహ్నం బైక్ సీటు కింద తాచుపాము కనిపించి భయపెట్టేసింది. తుని నుంచి విధులు నిర్వహించేందుకు కోటనందూరు పోలీస్ స్టేషన్‌కి వెళ్తున్న శివాజీ అనే కానిస్టేబుల్ బైక్ నుంచి ఒక్కసారిగా శబ్దం వచ్చింది. కింద నుంచి ఎవరో కొడుతున్నట్టు అనిపించింది. దీంతో శివాజీ బైక్ దిగి చూడగా ఏమీ కనిపించలేదు. అలా పరిశీలిస్తూ సీటు తెరిచిచూడగా తాచుపాము పడగ విప్పి కనిపించింది. ఊహించని ఈ పరిణామంతో

పడగ విప్పి కూర్చున్న తాచుపాము

స్థానికులు భయాందోళనకు గురయ్యారు. శివాజీ ధైర్యంగా పామును స్థానికుల సాయంతో సమీపంలోని కొండ ప్రాంతంలో వదిలేశాడు.


బుసలు కొడుతున్న పాము
బైక్‌పై తాచుపామును చూస్తున్న కానిస్టేబుల్ శివాజీ

ఎం.రావిలంకలో కొండచిలువ హతం


హతమైన కొండ చిలువ

దేవీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం ఇందుకూరు పంచాయతీ ఎం.రావిలంక గ్రామంలోని ఒక ఇంట్లో మంగళవారం రాత్రి కొండ చిలువ హల్‌చల్ చేసింది. దీన్ని గమనించిన స్థానికులు భయభ్రాంతులకు గురై హతమార్చారు. ఈ కొండచిలువ పొడవు సుమారు 12 అడుగులవరకు ఉంటుందని స్థానికులు తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో డీఎస్పీల జంట పూజలు


అన్నవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు డీఎస్పీలు ప్రేమించి పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక్కటైన జంట మంగళవారం కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో వ్రతమాచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తుతం కృష్ణాజిల్లా అవనిగడ్డ డీఎస్పీగా పనిచేస్తున్న విద్యశ్రీ, పల్నాడు జిల్లా గురజాల డీఎస్పీగా పనిచేస్తున్న జగదీష్‌లు గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇరుపెద్దల అంగీకారంతో వారు ఒక్కటయ్యారు. వారికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయగా దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఒకే క్యాడర్ గల అధికారుల ప్రేమవివాహం విశేషంగా మారింది.


వేదాశీర్వచనం పొందుతున్న డీఎస్పీల జంట

తుఫాన్ ఎఫెక్ట్ సత్యదేవుడి కానుకల లెక్కింపు వాయిదా

అన్నవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను ఈనెల 29న లెక్కించాలని నిర్ణయించారు. తుఫాన్ కారణంగా వాయిదా వేస్తున్నట్టు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో కొత్తతేదీ వెల్లడిస్తామన్నారు.

'ఏలేరు' నుంచి 5వేల క్యూసెక్కుల నీరు విడుదల


జలాశయం గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

ఏలేశ్వరం/పిఠాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో ఏలేరు రిజర్వాయర్ నుంచి 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వర్షాలకు జలాశయం పరివాహక ప్రాంతం నుంచి 5175 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు పెరిగే అవకాశం ఉంది. ప్రాజెక్టులో మరో 2 టీఎంసీలు నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. దీంతో ప్రాజెక్టులో మంగళవారం నాటికి 86.56 మీటర్లకుగాను 85.39 మీటర్లు, 24.11 టీఎంసీలకు 21.74 టీఎంసీలు చేరుకున్నాయి. దీంతో విశాఖకు 175 క్యూసెక్కులు, దిగువ ప్రాంతాలకు 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అయితే రిజర్వాయర్ నుంచి 5వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నట్టు చెప్తున్నా మంగళవారం సాయంత్రం గొల్లప్రోలు, పిఠాపురం మండలాల పరిధిలోని ఏలేరు కాలువల్లో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తే ఇది మరింత ఎక్కువ ఉండవచ్చని చెప్తున్నారు. గతంలో చెప్పిన దాని కంటే రెట్టింపు నీటిని విడుదల చేసి పొలాలను ముంచివేశారని, ఇప్పుడూ అలాగే చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ సందేహాలు సరికాదని ఏలేరు అధికారులు స్పష్టం చేస్తున్నారు. రిజర్వాయర్‌ను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సందర్శించి అధికారులను అప్రమత్తం చేశారు. ఏలేశ్వరం- అప్పనపాలెం మధ్య ఏలేరు ప్రధాన కాలువపై కుంగిన కాజ్‌వేను పరిశీలించి ప్రజలు రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

లారీ ఢీకొని బాలుడి మృతి


మృతిచెందిన బాలుడు జాన్‌వెస్లీ

దివాన్‌చెరువు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీకృష్ణపట్నం - భూపాలపట్నం మధ్య మంగళవారం లారీ ఢీకొని పాతతుంగపాడుకు చెందిన నాగులాపల్లి జాన్‌వెస్లీ (14) అనే బాలుడు మృతిచెందగా, బోయిడి దుర్గాప్రసాద్ అనే మరో బాలుడు స్వల్పంగా గాయపడ్డాడు. రాజానగరం ఎస్ఐ నారాయణమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. జాన్‌వెస్లీ తన స్నేహితుడు దుర్గాప్రసాద్‌తో కలిసి బైక్‌పై వెళ్తున్నాడు. వారిని శ్రీకృష్ణపట్నం - భూపాలపట్నం మధ్య క్వారీ లారీ ఢీకొంది. బైక్‌పై వెనక కూర్చున్న జాన్‌వెస్లీ అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న దుర్గాప్రసాద్‌కు స్వల్పగాయాలయ్యాయి. జాన్‌వెస్లీ మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. జాన్‌వెస్లీ ద్వారపూడిలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడని బంధువులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి


మృతిచెందిన మహిళ

ఆలమూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆల మూరు మండలం చొప్పెల్ల వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన కిలా రమ (40) సోమవారం ఉదయం చొప్పెల్లలోని తోరాటి సుబ్రహ్మణ్యం ఇటుకబట్టీలో పనిచేయడానికి వచ్చింది. ఆమె కుమారుడు మరో బట్టీలో పనిచేస్తుండడంతో అక్కడికి వెళ్లి రాత్రి 7 గంటల సమయంలో తిరిగి వస్తుండగా రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొని అక్కడిక్కడే మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నరేష్ తెలిపారు.

కారు ఢీకొని విశ్రాంత ఎంపీహెచ్ఈవో మృతి

ఎటపాక, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని రిటైర్డ్ ఎంపీహెచ్ఈవో చిలుకూరి ముక్తేశ్వరరావు (63) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లిపాక గ్రామానికి చెందిన ముక్తేశ్వరరావు చింతూరు మండలం తులసిపాక పీహెచ్‌సీలో ఎంపీహెచ్‌వోగా విధులు నిర్వర్తించి గత నెలలో విరమణ పొందారు. మంగళవారం రాత్రి మోటారు సైకిల్‌పై భద్రాచలం వైపు వెళ్తున్న క్రమంలో పురుషోత్తపట్నం వద్దకు రాగానే వెనుక వైపు నుంచి వస్తున్న షిఫ్ట్ కారు ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. ఢీకొన్న కారు ఆపకుండా వెళ్లిపోయింది. ఎస్ఐ జి.అప్పలరాజు కేసు నమోదు చేశారు.


మృతి చెందిన ముక్తేశ్వరరావు

సామర్లకోటలో వందేళ్ల నాటి శిథిల భవనం కూల్చివేత


సామర్లకోటలో శిథిల భవనం కూల్చివేస్తున్న దృశ్యం


సామర్లకోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ నడిబొడ్డున వందేళ్ల నాటి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. మొంథా తుఫాన్ ప్రభావం భయానక పరిస్థితుల కారణంగా కూల్చివేశారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్పందించి మున్సిపల్ అధికారులతో తక్షణం కూల్చి వేయాలని ఆదేశించడంతో మంగళవారం సాయంత్రం క్రేన్ సహాయంతో కూల్చివేత పనులు నిర్వహించారు.

తుఫాన్ ఈదురుగాలికి...
సముద్రంలో మత్స్యకార యువకుడు గల్లంతు


సాయిరామ్ (ఫైల్)

కాకినాడ క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార యువకుడు కాకినాడ సముద్రంలో గల్లంతైన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే... కాకినాడ దుమ్ములపేటకు చెందిన గడ్డేపల్లి సాయి రాం (21) కు భార్య, కుమారుడు ఉన్నారు. కాగా అతడు చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. వేట సాగించే బోటును వేట అనంతరం కుంభాభిషేకం వద్ద నిలిపాడు. తుఫాను కారణంగా ఈదురుగాలులు తీవ్ర రూపం దాల్చడంతో ఆ బోటు అక్కడ ఉండడం శ్రేయస్కరం కాదని భావించి ఏటిమొగలోని కల్వర్ట్ వద్ద బోటును నిలుపుదామనుకున్నాడు. ఈ క్రమంలో బోటుకు వేసిన లంగర్‌ను లాగుతుండగా ఒక్కసారిగా విరుచుకుపడిన రాకాసి అలతో పాటు వేగంగా వీచిన ఈదురుగాలికి సాయిరాం సముద్రంలో పడి గల్లంతయ్యాడు. వెంటనే గాలింపు చర్యలు చేపట్టినా యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు. పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో గల్లంతైన
బాలుడి కోసం ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం గాలింపు


చరణ్ (ఫైల్)

సర్పవరం జంక్షన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సూర్యారావుపేట పర్ర కాలువలో కాకినాడ మధురానగర్‌కి చెందిన 11 ఏళ్ల పోలవరపు చరణ్‌సాయి రిత్విక్ సోమవారం గల్లంతైన సంగతి తెలిసిందే. మంగళవారం ఎస్‌డీఆర్ఎఫ్ బృందం ఆధ్వర్యంలో పర్ర కాలువ, సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టినట్టు తిమ్మాపురం ఎస్ఐ వై.గణేష్‌కుమార్ తెలిపారు. తుఫాన్ ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా ఉందని, ఇది గాలింపు చర్యలపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. బుధవారం గాలింపు చర్యలు కొనసాగిస్తామన్నారు. కుమారుడి ఆచూకీ కోసం తల్లిదండ్రులు రమణ, దుర్గాభవాని, మేనమామ కొప్పిశెట్టి శ్రీనివాస్, ఇతర కుటుంబసభ్యులు ఎదురుచూస్తున్నారు.

తల్లీబిడ్డ మృతిపై
జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

రంపచోడవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అల్లూరి జిల్లా రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో తల్లీబిడ్డ మృతి చెందిన ఘటనపై జాతీయ ఎస్టీ, మహిళా, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్టు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను తెలిపారు. సంఘటనపై త్వరలో ఏరియా ఆసుపత్రిని ముట్టడించనున్నామని, గిరిజన ప్రాంత ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

రైతు బజారుకు సెలవు రద్దు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ కారణంగా ప్రజలు కూరగాయలకు ఇబ్బందిపడకుండా రైతుబజార్ల వారంతాపు సెలవును రద్దు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఆర్టీసీ రైతుబజారు బుధవారం తెరిచే ఉంటుందని ఎస్టేట్ ఆఫీసర్లు కృష్ణారావు, గోవిందరాజు తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం



కాకినాడలోని ఓ పునరావాస కేంద్రంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



పెదపూడిలో నేలకొరిగిన పొలాలను పరిశీలిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



కాకినాడ రూరల్ వాకలపూడిలోని పునరావాస కేంద్రంలో మహిళలతో మాట్లాడుతున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే నానాజీ

బాధితులకు భరోసా

పునరావాస కేంద్రాలను సందర్శించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

తుఫాన్ నేపథ్యంలో ఆందోళన వద్దు... అప్రమత్తంగా ఉండాలని పిలుపు

కాకినాడ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్.అచ్యుతాపురం జనచైతన్య కాలనీ, రాజీవ్ గృహకల్పలో నివాసముంటున్న పల్లపు ప్రాంతాల ప్రజలను సమీపంలోని బొగ్గవరపు సత్రంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి ఎమ్మెల్యే పంతం నానాజీ తరలించారు. అనంతరం ఆయన ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరంతో కలిసి వాకలపూడి ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ కూడా వచ్చి బధిత మహిళలకు పలు సూచనలు చేశారు. తూరంగి పగడాలపేటలోని పునరావాస కేంద్రంలో బాధితులకు ఎమ్మెల్యే భోజనాలు వడ్డించారు. డీపీవో రవికుమార్, తహసీల్దారు కుమారి, ఎంపీడీవో సతీష్, రాష్ట్ర ఖాదీ బోర్డు డైరెక్టర్ శిరంగు శ్రీనివాసరావు, పాంద్రంకి రాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను కమిషనరు కేటీ సుధాకర్ పరిశీలించి బాధితులకు అందుతున్న సహాయక చర్యలను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దేవి మల్టీప్లెక్స్ సమీపంలోని భాస్కర బిల్డింగ్ పక్కన భవనాల యజమానుల ఫిర్యాదు మేరకు కమిషనరు సుధాకర్, అర్బన్ తహసీల్దారు జితేంద్ర అక్కడకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. భవనం ప్రమాదకరంగా మారే అవకాశమున్నందున వెంటనే ఖాళీ చేసి బంధువుల ఇళ్లకు లేదా పునరావాస కేంద్రాలకు తరలిపోవాలని సూచించారు. పునరావాస కేంద్రంలో బాధితులకు అందిస్తున్న భోజనం తయారీని వారు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యటనలో ఎస్ఈ పి.వెంకటరావు, డిప్యూటీ కమిషనరు కె.శ్రీనివాసరావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, ఏఈలు, డీఈలు పాల్గొన్నారు. నగరంలోని పాతబస్టాండ్ వెంకటేశ్వరస్వామి కాలనీ, ఏటిమొగ, బుడంపేటల్లో తుఫాన్ పునరావాస కేంద్రాలను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీప్రసన్న, జనసేన గోదావరి జిల్లాల సమన్వయకర్త రావాడ నాగు, బీజేపీ నాయకులు సందర్శించారు. నిర్వాసితులతో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణ శివారులోని టిడ్కో గృహాలను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరిశీలించారు. ఏలేరు కాల్వ నీటి ఉధృతిని పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సత్యవరపుపేట కాలనీలో ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. భారీ వర్షాలకు ఏటిగట్టు ప్రమాదస్థితికి చేరుకోకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట నిమ్మకాయల రంగనాగ్, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్ (బాబు), బలుసు శ్రీనివాసు, కుర్రా నారాయణస్వామి (రాజు), గొల్లపల్లి సర్వేశ్వరరావు, కొప్పిరెడ్డి రాజా, పెద్దిరెడ్డి కొండలరావు, మున్సిపల్ కమిషనరు ఎ.శ్రీవిద్య, టీపీవో మంజుల వున్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): నగరంలోని దుమ్ములపేట, పర్లోవపేట, కొత్త కాకినాడ, ఏటిమొగల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పరిశీలించి ఏర్పాట్లపై ప్రజలతో మాట్లాడారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఆయన వెంట మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, అమన్‌జైన్, అరదాడి శివ, గెడ్డం పూర్ణచంద్ర శేఖర్, మోసా పేతూరు, చోడిపల్లి సతీష్, మూగు రాజు, పినపోతు రాము వున్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పునరావాస కేంద్రాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ సందర్శించి బాధితులతో మాట్లాడారు. వారికి స్వయంగా భోజనం వడ్డించారు. శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ధూళిపూడి బాబి, కార్యదర్శి కట్టా త్రిమూర్తులు, వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి, నేతలు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. తూరంగి పునరావాస కేంద్రంలో ఉన్న హోప్ ఐలాండ్ బాధితులతో ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే సుబ్బరాజు మాట్లాడి తుఫాన్ తగ్గే వరకు ఇక్కడే ఉండాలని కోరారు. గాడిమొగలో కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, ఎంపీ సానా సతీష్ పర్యటించి పునరావాస కేంద్రాల్లో ఉన్న మత్స్యకారులతో మాట్లాడారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. వారి వెంట సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, కామాడి మాతరాజు, ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, వివిధ శాఖల అధికారులు వున్నారు.

కాజులూరు (కరప) (ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలంలోని గొల్లపాలెం, కోలంక గ్రామాల్లో పలు వృక్షాలు కూలిపోయాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్ వెంటనే అధికారులను అప్రమత్తం చేసి దగ్గరుండి వాటిని తొలగింపజేశారు. పునరావాస కేంద్రాలను సందర్శించి బాధితులకు ధైర్యం చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను మంత్రి సుభాష్ ఆదేశించారు.

ఏలేరు కాలువల పరిశీలన

గొల్లప్రోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిస్తే ఏలేరు నుంచి భారీగా జలాలు విడుదల చేసే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు అధికారులను ఆదేశించారు. గొల్లప్రోలు పట్టణ శివారులో ఏలేరు కాలువలను ఆయన పరిశీలించారు. ఇన్‌ఫ్లోస్ పెరిగే అవకాశముందని, 10వేల క్యూసెక్కుల వరకు నీరు విడుదల చేయవచ్చని చెప్పారు. పంట పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదముందని, గ్రామాల్లోకి నీరు వస్తే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. పిఠాపురం, గొల్లప్రోలు తహసీల్దార్లు పీవీ గోపాలకృష్ణ, రామకుమార్, ఇరిగేషన్ ఏఈఈ ప్రసన్నకుమార్ ఉన్నారు.

నేలకొరిగిన పంట పొలాలు

కరప (ఆంధ్రజ్యోతి): మండలంలో 205 హెక్టార్లలో వరి పంట దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఏడీ కె.బాబూరావు, ఏవో సత్య నడకుదురు, జడ్.భావారం, కొరుపల్లి, అరట్లకట్ట తదితర గ్రామాల్లో పర్యటించి నష్ట నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. ఉప్పలంకలో పునరావాస కేంద్రాన్ని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు సందర్శించి బాధితులకు ధైర్యం చెప్పారు. పునరావాస కేంద్రానికి 200 మంది మత్స్యకారులను తరలించి వారికి అన్ని సదుపాయాలు కల్పించినట్టు తహసీల్దారు తుమ్మల దుర్గాప్రసాద్ తెలిపారు. ఎస్ఐ తోట సునీత, ఆర్ఐ పవన్‌లతో కలిసి మత్స్యకారులెవరూ వేటకు వెళ్లవద్దని సూచించారు. పేపకాయలపాలెంలో తాటాకు పాకల్లో ఉంటున్న పలు కుటుంబాలను ఖాళీ చేయించి సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆశ్రయం కల్పించారు. జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భోగిరెడ్డి గంగాధర్ బాధితులకు అవసరమైన ఏర్పాట్లు చేయించారు. వేళంగిలోని పలు కుటుంబాలకు స్థానిక సత్రంలో తాత్కాలిక ఆవాసం ఏర్పాటుచేశారు. కరప తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు. వాకాడ ప్రభుత్వ పాఠశాలపై, కరప మండల పరిషత్ కార్యాలయంపై కూలిన భారీ వృక్షాలను తొలగించారు. కొంగోడు, పాతర్లగడ్డ, వేళంగిల్లో విద్యుత్ స్తంభాలు పడి సరఫరా నిలిచిపోయింది. జేఈ దొర సిబ్బందితో కలిసి మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): తుఫాన్ పరిస్థితిని ఆర్డీవో కె.శ్రీరమణి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఏలేరు పరివాహక గ్రామాలైన కాండ్రకోట, మర్లావ, కట్టమూరుల్లో తహసీల్దారు సీహెచ్ వెంకటలక్ష్మి, ఎస్ఐ మౌనిక పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఈదురుగాలులకు పట్టణ పరిధిలోని గౌరీకోనేరు ప్రాంతంలో వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. మున్సిపల్ కమిషనరు శ్రీకాంత్‌రెడ్డి పరిస్థితిని పరిశీలించి ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపట్టారు. సీపీఎం నాయకులు దారపురెడ్డి క్రాంతి కుమార్, నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్ పర్యటించి మంచినీటి, విద్యుత్ సౌకర్యానికి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. పెద్దాపురం-జగ్గంపేట ప్రధాన రహదారిలో చెట్లు నేలకొరిగాయి. కొమ్మలు విరగిపడి విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. స్తంభాలు కూలడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పాత పెద్దాపురం శివారులో ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహించడంతో అధికారులు పరిశీలించి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. కట్టమూరు, పులిమేరు, కాండ్రకోట, గుడివాడ, సిరివాడ, దివిలి తదితర గ్రామాల్లో వరి పైరు ఈదురు గాలులకు నేలవాలింది.

పెదపూడి (కరప) (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలం పెదపూడి, ఏపీ త్రయం, గొల్లల మామిడాడ గ్రామాల్లో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పర్యటించి మునిగిన, నేలకొరిగిన పంట పొలాలను పరిశీలించారు. వరద ఉధృతితో పోటెత్తుతున్న ఏలేరు డ్రెయిన్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. డ్రెయిన్‌లో డ్రైన్‌లో పేరుకుపోతున్న గుర్రపుడెక్కను ఎప్పటికప్పుడు తొలగిస్తూ వరద నీరు కిందకు పోయేలా చూడాలన్నారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ, ఎ.విజయనగరం, చెందుర్తి, తాటిపర్తి, వన్నెపూడి, చిన జగ్గంపేట, పిఠాపురం మండలం పి.దొంతమూరు, వెల్దుర్తి, కందరాడ, కోలంక, విరవ, విరవాడ గ్రామాల్లో అరటి తోటలు నేలనంటాయి. ఎకరానికి రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు నష్టం జరిగిందని రైతులు తెలిపారు. సుమారు 400 ఎకరాల్లో అరటి పంటకు నష్టం జరిగినట్టు అంచనా. పిఠాపురం, గొల్లప్రోలు మండలాల పరిధిలో బొప్పాయి, మునగ తోటలు, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. పత్తి, మిరప, కాయగూరల మొక్కలు విరిగిపోతున్నాయని రైతులు చెప్పారు. మెట్ట మండలాల్లో విడిచిన పత్తి వర్షానికి తడిచిపోయింది. నాణ్యత దెబ్బతిని ధర రాదని రైతులు చెప్పారు. 2,100 ఎకరాల్లో పత్తి, 200 ఎ కరాల్లో మొక్కజొన్నకు నష్టం వాటిల్లిందని చెప్తున్నారు.

'కష్టకాలంలో కూటమి ప్రభుత్వం అండ'

పిఠాపురం రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులు, ప్రజలతో మాట్లాడారు. ఎవ్వరూ ఆందోళన చెందవద్దని, పొలాలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని, పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని చెప్పారు.

అరబిందో ఫార్మా ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ

కొత్తపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి, తొండంగి మండలాల్లోని తీర ప్రాంత గ్రామాల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు 300 మందిని తరలించారు. వారి కోసం అరబిందో ఫార్మా ఫౌండేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నిత్యానందరెడ్డి ఆదేశాలతో కలెక్టర్ షాన్‌మోహన్ బృందం ఆధ్వర్యంలో 16వేల ఆహారం, వాటర్ ప్యాకెట్లను సిద్ధం చేశారు. వీటిని వ్యాన్లలో తరలించారు.

ఎగసిపడుతున్న అలలు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కాకినాడ రూరల్‌లోని కుంభాభిషేకం నుంచి హార్బరుపేట, సూర్యారావుపేట, నేమాం బీచ్‌లో సముద్ర అలలు ఎగసిపడుతున్నాయి. కెరటాలు తీరాన్ని బలంగా తాకుతున్నాయి. కాకినాడ- ఉప్పాడ బీచ్ రోడ్డులో రాకపోకలు సాగించవద్దని కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్య కృష్ణ, వాకలపూడి మెరైన్ సీఐ టి.రామ్మోహన్‌రెడ్డి కోరారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు.

కలెక్టర్ బంగ్లా వద్ద కూలిన చెట్టు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కలెక్టర్ బంగ్లా వద్ద ఒక చెట్టు గాలికి ఒరిగి ఉండడాన్ని అధికారులు గుర్తించారు. ముందుగా ట్రాఫిక్‌ను మళ్లించి కూలిన చెట్టును తొలగింపజేశారు. శ్రీనగర్ ఆదిత్య కాలేజీ వద్ద కూలడానికి సిద్ధంగా వున్న చెట్టును గమనించిన అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు.

పెరుగుతున్న సుద్దగడ్డ వరద ఉధృతి

గొల్లప్రోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షంతో గొల్లప్రోలు వద్ద సుద్దగడ్డ (కొండ) కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. గొల్లప్రోలు-తాటిపర్తి పంచాయతీరాజ్ రహదారిపై నాలుగు అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహిస్తుండటంతో ఈ మార్గంలో రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. రైతులు పశువులు కోసం గడ్డిని ఈ నీటిలో నుంచే తెచ్చుకుంటున్నారు. ప్రమాదమని తెలిసినా తప్పట్లేదని రైతులు తెలిపారు.

మంత్రిని కలిసిన టీడీపీ నేతలు



అమరావతిలో రామానాయుడుకు వినతిపత్రమిస్తున్న దృశ్యం

వీఆర్‌పురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును వీఆర్‌పురం మండల టీడీపీ నేతలు మంగళవారం అమరావతిలోని ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా పోలవరం నిర్వాసితుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రిని కలిసిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు బొర్ర నరేష్ కుమార్, సీనియర్ నేత బొర్ర నరసింహారావు, ముత్యాల సిద్దార్థ, బొర్ర ఆది, కోట్ల అప్పాజీ, బొర్ర సూరి, బాలయ్య, శంకరరావు, ముత్యాలు, చంద్రశేఖర్, జలబాబు, ఎస్‌డీ సర్వరాజు, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉన్నాం

ఎటపాక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ విపత్తును ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉందని ప్రత్యేక అధికారి డాక్టర్ పుల్లయ్య, తహశీల్దార్ కారంసుబ్బారావు తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో తుఫాన్‌పై చేపట్టవల్సిన చర్యలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. అత్యవసర సమాచారం కోసం 9440204200, 9959086952 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఎంపీడీవో నాగమణి, ఎస్ఐ జీ. అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ రక్షణ సామగ్రి పంపిణీ

తుని రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సహాయక చర్యల్లో పాల్గొనే సిబ్బందికి రక్షణ సామగ్రిని తుని మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, కమిషనర్ వెంకట్రావు రెయిన్ కోట్లు, టోపీలు అందజేశారు. అలాగే ట్రీ కటింగ్ మిషన్లు, గ్రాస్ కట్టింగ్ మిషన్లు కూడా అందుబాటులో ఉంచామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ చల్లకుండ సతీష్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ షఫీం, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పొదలు తొలగింపు

కూనవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మర్రిగూడెం పాఠశాలలకు వెళ్లే మార్గంలో దట్టమైన పొదలు రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోవడంతో ఆ మార్గంలో వెళ్లే విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడేవారు. ఈ విషయం అధికారుల దృష్టికి రావడంతో మంగళవారం పొక్లెయిన్‌తో తొలగించారు. ఈ సందర్భంగా అధికారులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ సొందే రామయ్య, పంచాయతీ కార్యదర్శి రాజబాబు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఐటీడీఏ పీవో

రంపచోడవరం / దేవీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ అన్నారు. మంగళవారం దిరిసినపల్లి, ఇందుకూరు, ఇందుకూరుపేట, పెదభీంపల్లి, లోతుపాలెం, చాపరాయి పల్లి, తదితర గ్రామాల్లో పర్యటించారు. పీవో మాట్లాడుతూ తీరం దాటే సమయంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఒకవేళ ఇబ్బందులెదురైతే ఐటీడీఏ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ ఫోన్ నెం. 0864-242114ను సంప్రదించాలన్నారు. తహశీల్దార్ కె.సత్యనారాయణ, ఎంపీడీవో సాల్మన్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే దేవిపట్నం మండలంలో పీవో పర్యటించారు. ఈయనతోపాటు తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో సాల్మాన్‌రాజు, ఎస్ఐ షరీఫ్, తదితరులు ఉన్నారు.

చింతూరు: తుఫాన్ నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాని చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ పేర్కొన్నారు. మంగళవారం వివిధశాఖల అధికార బృందంతో చింతూరు, కూనవరం మండలాల్లోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. ఈయనతో అధికారులు ఉన్నారు.

తుఫాన్ ఎఫెక్ట్.. భారీ ఈదురుగాలులు

రాజవొమ్మంగి అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా మంగళవారం భారీ ఈదురుగాలులతోపాటు వర్షం కురిసింది. దూసరపాము జాతీయ రహదారిపై తాటిచెట్టు, అనంతగిరి సమీపంలో రోడ్డు, అప్పన్నపాలెం సమీపంలోని రోడ్డుపై వృక్షాలు నేలకొరిగాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు వాటిని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. శరభవరం పంచాయతీ వనకరాయిలో పప్పుల పకీరయ్య పశువుల పాకపై భారీ చింతచెట్టు పడిపోవడంతో పాకలో ఉన్న మేక మృతి చెందింది. తహశీల్దార్ అల్లు సత్యనారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రాజవొమ్మంగిలో రాజవొమ్మంగి-శాంతినగర్ మధ్య, వట్టిగెడ్డ-ఎర్రంపాడు మధ్య, దూసరపాము -నెల్లిమెట్ల మధ్య, కొండ లింగంపర్తి-పెద్ద గర్రంగి మధ్య రోడ్లపై కొండవాగులు పొంగిప్రవహించడంతో లోతట్టు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగులను మండల ప్రత్యేకాధికారి రంపచోడవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరేశ్వరావు, సీఐ గౌరీ శంకర్, రాజవొమ్మంగి ఎస్ఐ శివకుమార్, జడ్డంగి ఎస్ఐ చినబాబు పర్యవేక్షించారు. వర్షాల కారణంగా వట్టిగెడ్డ రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరింది.

రౌతులపూడి: మొంథా తుఫాన్ ప్రభావంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఎన్ఎన్‌పట్నం, ఎమల్లవరం, ఎస్.అగ్రహారం, పారుపాక, తదితర గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మల్లవరం, రౌతులపూడి శివారులో చెట్లు నేలకొరిగాయి. వర్షం ఉధృతికి రౌతులపూడి ప్రధాన రహదారిపై నీరు, అలాగే ఏటికాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది.

కోటనందూరు: తుఫాన్‌పై అధికారులు అప్రమత్తమయ్యారు.మంగళవారం కోటనందూరు వంతెన పైనుంచి స్వల్పంగా నీరు పారడంతో ముందస్తు చర్యలో భాగంగా పోలీస్‌లు గస్తీ నిర్వహించినట్టు ఎస్ఐ టీ. రామకృష్ణ, తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో డీ. చిరంజీవిరాజు, లగుడు సత్యనారాయణమూర్తి, బోడపాటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస శిబిరాలను వినియోగించుకోవాలి : ఎమ్మెల్యే



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివ్య

తొండంగి అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాలను తీరప్రాంత గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. మంగళవారం ఆమె పెరుమాళ్లపురం, చోడిపల్లిపేట, ఆవుల మంద, బుచ్చియ్యపేట, తదితర గ్రామాల్లో పర్యటించారు.అలాగే గడ్డిపేట ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, డీసీసీబీ అధ్యక్షుడు తుమ్మల రామస్వామితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, మత్స్యకార నాయకులు కోడ వెంకటరమణ, గంటా లక్ష్మణ్, చొక్కా అప్పారావు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఏవో రత్నప్రభ పర్యటన

మోతుగూడెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం గూడూరు పంచాయతీ గూడూరు, చదలవాడ పంచాయతీ కన్నుసులూరు, తదితర ప్రాంతాల్లో ఏవో రత్నప్రభ మంగళవారం పర్యటించారు. ఆయాప్రాంతాల్లో వరి, తదితర పంటలను పరిశీలించి మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో పంట నష్టం జరగకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అధికార యంత్రాంగం అప్రమత్తం

తొండంగి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమయ్యింది. గాలుల కారణంగా చెట్లు, విద్యుత్ స్థంబాలు కూలితే వాటిని తక్షణమే తొలగించి మార్గం సుగమం చేసేందుకు మండలాన్ని నాల్గు రూట్లగా విభజించి నాల్గు మొబైల్ టీంలను ఏర్పాటు చేశారు. దీంతో ఎప్పటికప్పుడు రూట్‌ను క్లియర్ చేస్తున్నారు. మంగళవారం అన్నయ్యపేట, తొండంగి, తాటియాకుల పాలెం, తదితర గ్రామాల్లో చెట్లు నేలకూలడంతో వాటిని తొలగించారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి : ఎమ్మెల్యే



ఏలేశ్వరం: అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావిత పరిస్థితులను అధికారులు సమర్థవంతంగా ఎదుర్కోవాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. సంబంధిత అధికారులు అత్యవసర సేవలను ప్రజలకు వేగంగా అందించాలన్నారు. తుఫాన్ కారణంగా అధిక వర్షాలతో నీటి పారుదల శాఖ, ఏరియా ఆసుపత్రి, రెవెన్యూ, విద్యుత్‌శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

తుఫాన్‌తో మినుము రైతులకు నష్టాలు

గండేపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలతో మినప రైతులకు తీవ్ర నష్టాలు వాటిల్లాయి. మండలంలో పలు చోట్ల తీసిన పనలు తడిసి ముద్దవగా మరికొన్ని చోట్ల పొలాల్లో పంట మొలకలు వచ్చేశాయి. రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం పంట నష్టాన్ని గుర్తించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

కూలిన విద్యుత్ స్తంభాలు

గండేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): యర్రంపాలెం, తాళ్ళూరు లిఫ్ట్ ఇరిగేషన్‌కు విద్యుత్ సరఫరా అయ్యే 33కేవీ, 11కేవీ విద్యుత్ స్తంభాలు కాట్రావులపల్లి సమీపంలో గాలికి నేలకొరిగాయి. దీంతో ఎలక్ట్రికల్ ఏఈ కిరణ్‌కిషోర్ సిబ్బందితో మరమ్మతులు చేపట్టి విద్యుత్ లైన్లు క్లియర్ చేశారు.

ఏలేరు కాలువను పరిశీలించిన అధికారులు, నాయకులు

కిర్లంపూడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వరదతో ఏలేరు ప్రాజెక్టు పరిసరాల ప్రాంత ఏటిగట్లు గండ్లు పడేందుకు పరిస్థితి ఉండడంతో మంగళవారం పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, తహశీల్దార్ జె.చిరంజీవి, జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎంపీడీవో హరికృష్ణ, ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ బస్వా వీరబాబు పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన ఇసుక బస్తాలు, కర్రలతో గండ్లు పూడ్చే పనులు చేపట్టారు. రాజుపాలెంలో ఆలు కాలువ కోతకు గురవడంతో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు గొడే దొరబాబు వాటిని పూడ్చే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ముక్కొల్లు గ్రామ పరిసర ప్రాంతాల్లో బెడ్ రెగ్యులేటర్ పరిధిలోని కాలువ కోతకు గురవడంతో దాన్ని పరిశీలించారు.

వందలాది ఎకరాల పంటకు నష్టం

ప్రత్తిపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా మండలంలోని వందలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఏలూరు, టి.రాయవరం, ప్రత్తిపాడు, పెదశంకర్లపూడి, లంపకలోవ, ఉత్తరకంచి, వేములపాలెం, పెద్దిపాలెం తదితర గ్రామాల్లో వరి, అరటి పంటలు దెబ్బతిన్నాయి. మండల వ్యవసాయాధికారి జోకా అమృత, ఏలేశ్వరం హార్టికల్చర్ అధికారిణి కె.దివ్యశ్రీ దెబ్బతిన్న వరి, అరటి పంటలను పరిశీలించారు. ప్రత్తిపాడులో కుండపోత వర్షం కురిసింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు, పొలాలు జలమయమయ్యాయి. అలాగే విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. ఉత్తరకంచి సబ్‌స్టేషన్ పరిధిలో 16 గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అలాగే ధర్మవరం, రాచపల్లి తదితర మైదానగ్రామాలు సైతం విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

భారీ వర్షాలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేటరూరల్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మంగళవారం సాయంత్రం 6.30గంటల నుంచి మండలంలో భారీ ఈదురుగాలులతో వర్షాలు కురుస్తున్నాయి. ఈదురుగాలులతో చెట్లు విద్యుత్ వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీవర్షంతో రోడ్లు జలమయమయ్యాయి.

నేలకొరిగిన వృక్షాలు

జగ్గంపేట రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ తీవ్రమైన గాలుల ప్రభావంతో జగ్గంపేట - గోకవరం రోడ్డులో జైకొత్తూరు గ్రామ శివారున టేకు చెట్టు రోడ్డుకు అడ్డంగా పడింది. భారీ ఈదురుగాలుల వల్ల రాజపూడి వద్ద చెట్టు విద్యుత్ వైర్లపై వేలాడుతూ ఉంది.

అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి



ఏలేరు గట్టు వద్ద పనులు పరిశీలిస్తున్న జ్యోతుల నవీన్

జగ్గంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏలేరు జలాశయానికి ఇన్ ఫ్లో పెరిగే అవకాశం ఉందని, కావున దిగువ ప్రాంతాల్లో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆదేశించారు. మంగళవారం ఇర్రిపాకలోని ఏలేరు ఏటిగట్లను పటిష్ఠపరిచే చర్యలను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ఏలేరు ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి ఎక్కువ మొత్తంలో నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నుంచి అధిక శాతం నీరు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్, రమేష్, ఎస్ఐ రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన



రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

కిర్లంపూడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం రైతు సేవా కేంద్రంలో ఏవో సుధాముధురి ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయ్‌కుమార్ హాజరయ్యారు. తుఫాన్ పట్ల రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వరికోతలు ప్రస్తుతం నిలుపుదల చేయాలని సూచించారు. మడుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో సురేష్, వీఏఏ పార్వతి, రమ్య, మంజూష, పలువురు రైతులు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డిసాగర్ నీటిమట్టం పెరుగుదల



సుబ్బారెడ్డిసాగర్‌కు పెద్ద ఎత్తున వరద నీరు చేరుతున్న దృశ్యం

ప్రత్తిపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇ.గోకవరం వద్ద గల మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు సుబ్బారెడ్డిసాగర్ ప్రాజెక్టులోకి తుఫాన్ కారణంగా పెద్ద ఎత్తున వరదనీరు వస్తున్నది. దీంతో 87 మీటర్ల గరిష్టస్థాయి నీటిమట్టం కలిగిన ప్రాజెక్టులో మంగళవారం సాయంత్రం నాటికి 81.85 మీటర్ల స్థాయికి నీటిమట్టం చేరుకుంది. ప్రాజెక్టును తహశీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, ఆర్ఐ ఎ.గోపాలకృష్ణ పరిశీలించారు. ప్రాజెక్టులోని నీటిమట్టం, ఇన్‌ఫ్లో వాటర్‌పై సమీక్షించారు. ఒమ్మంగిలో షేక్ కీర్తు, అడబాల రాజారత్నంలకు చెందిన గృహాలు పాక్షికంగా దెబ్బతినడంతో వాటిని తహసీల్దార్, ఎంపీడీల బృందం పరిశీలించింది.

వాహనాలను నిలిపివేసిన పోలీసులు



రాయవరంలో వాహనాలను నిలిపివేసిన పోలీసులు

జగ్గంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా జగ్గంపేటలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. జగ్గంపేటలో జాతీయ రహదారి సుమారుగా 30 కిలోమీటర్ల మేర ఉండడంతో రాత్రి 7 గంటల నుంచి రాకపోకలు నిలిపివేశారు. జగ్గంపేట మండలం రాయవరం గ్రామంలో భారీ వాహనాలను పోలీసులు ఆపి పార్కింగ్‌లో ఉంచారు.